అగ్ర నిర్మాత దిల్‌రాజు బుధవారం తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఛాంబర్‌కు వచ్చిన ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన టీఎఫ్‌డీసీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తానని, తెలంగాణ సంస్కృతి ఆధారంగా సినిమాలు వచ్చేందుకు కృషి చేస్తానని, ఇండస్ట్రీలోని అన్ని విభాగాల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని చెప్పారు.



# కశ్మీర్‌లో పోలీస్ వేట



'హిట్' సిరీస్ చిత్రాల్లో తొలి రెండు భాగాలు థ్రిల్లింగ్, సస్పెన్స్ అంశాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. దాంతో 'హిట్: ది థర్డ్ కేస్'పై అంచనాలు పెరిగాయి. నాని కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిస్తున్న ఈ చిత్రానికి ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. శ్రీనిధిశెట్టి కథానాయిక. నాని పోలీసాఫీసర్‌గా నటిస్తున్న ఈ క్రైమ్ థ్రిల్లర్ తాజా షెడ్యూల్ కశ్మీర్‌లో మొదలైంది. నానితో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలతో పాటు ఇంటెన్స్ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాలో నాని పాత్ర శక్తివంతంగా ఉంటుందని, మునుపెన్నడూ చూడని రీతిలో సరికొత్త మేకోవర్‌తో కనిపిస్తాడని చిత్ర బృందం పేర్కొంది. వచ్చే ఏడాది మే 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జే మేయర్, రచన-దర్శకత్వం: శైలేష్ కొలను.

# అలాంటి అబ్బాయి కావాలి!



అగ్ర కథానాయిక రష్మిక మందన్న వరుస సినిమాలతో బిజీగా ఉంది. 'పుష్ప-2' విజయోత్సాహంలో ఉన్న ఈ భామ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. తన లైఫ్‌లోకి రాబోయే భాగస్వామి ఎలా ఉండాలో వివరించింది. జీవితంలోని ప్రతీ మలుపులో అతను తోడుండాలని, కష్టసమయంలో అండగా నిలబడాలని, అన్నివేళల్లో భద్రతనివ్వాలని చెప్పింది. రష్మిక మందన్న మాట్లాడుతూ 'స్త్రీ పురుష సంబంధాల్లో పరస్పర గౌరవం, నమ్మకం చాలా ముఖ్యమైన అంశాలు. ఒకరి పట్ల ఒకరికి గౌరవం ఉంటే జీవితాంతం కలిసి ఉండొచ్చు. కోపతాపాలకు దూరంగా అర్థం చేసుకునే సహృదయత కలిగి ఉండాలి. అలాంటి అబ్బాయే కావాలనుకుంటున్నా' అని చెప్పింది. జీవితానికి తప్పకుండా ఓ తోడు అవసరమని, మన కష్టాలను పంచుకునే వారు లేని జీవితాన్ని ఊహించలేమని రష్మిక మందన్న అభిప్రాయపడింది. ప్రస్తుతం ఆమె 'ది గర్ల్‌ఫ్రెండ్' 'రెయిన్‌బో' 'సికందర్' 'ఛావా' 'కుబేర' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

# లాపతా లేడీస్‌కు నిరాశ

## ఆస్కార్ రేసు నుంచి ఔట్ | షార్ట్‌లిస్ట్‌లో యూకే హిందీ చిత్రం 'సంతోష్', లైవ్ యాక్షన్ విభాగంలో 'అనూజ'



**భారత్** నుంచి ఆస్కార్ పురస్కారాలకు అధికారికంగా ఎంపికైన 'లాపతా లేడీస్' చిత్రం రేసు నుంచి నిష్క్రమించింది. మంగళవారం ప్రకటించిన 2025 ఆస్కార్ షార్ట్‌లిస్ట్‌లో ఈ సినిమాకు చోటు దక్కలేదు. దీంతో భారతీయ సినీ ప్రియులు నిరాశకు గురయ్యారు. అగ్ర నటుడు అమీర్‌ఖాన్ నిర్మించిన ఈ సినిమాకు ఆయన మాజీ సతీమణి కిరణ్ రావు దర్శకురాలు. స్పర్శ్ శ్రీవాత్సవ, నితాన్షి గోయెల్, ప్రతిభ ప్రధాన పాత్రల్లో నటించారు. బాక్సాఫీస్ పరంగా సాధారణ విజయాన్ని అందుకున్న ఈ సినిమాకు ఓటీటీలో మాత్రం విశేషమైన ఆదరణ దక్కింది. 2001లో జరిగే ఈ కథలో భారతీయ సమాజంలో కట్టుబాట్ల పేరుతో మహిళల స్వేచ్ఛను హరిస్తున్న తీరుని, వారిపై పురుషాధిక్యాన్ని సందేశాత్మకంగా ఆవిష్కరించారు. మహిళా సాధికారత ఆవశ్యకతను తెలియజేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దురాచారాలను రూపుమాపాలనే అంశాలను చర్చిస్తూ కిరణ్ రావు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఓవైపు వినోదాన్ని పంచుతూనే అంతర్లీనంగా చక్కటి సందేశంతో ఈ సినిమా మెప్పించింది. పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డులను సొంతం చేసుకున్న ఈ సినిమా ఆస్కార్ బరి నుంచి నిష్క్రమించడంతో చిత్ర యూనిట్ నిరాశలో మునిగిపోయింది.

**షార్ట్‌లిస్ట్‌లో భారతీయులు తీసిన 'సంతోష్'**

ఇంగ్లాండ్‌కు చెందిన షనాహ గోస్వామి ప్రధాన పాత్రలో సంధ్యా సూరి దర్శకత్వంలో రూపొందిన హిందీ చిత్రం 'సంతోష్' యూకే నుంచి ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో స్థానం దక్కించుకుంది. ఉత్తర భారతంలోని గ్రామీణ నేపథ్య కథాంశమిది. పోలీస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఓ విధవరాలు గ్రామంలో జరిగిన బాలిక హత్యోదంతాన్ని ఎలా ఛేదించిందన్నదే ఈ చిత్ర కథ. 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమాకు ప్రశంసలు దక్కాయి. ఆస్కార్ పురస్కారం సాధించే అవకాశాలు ఈ సినిమాకు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

**లైవ్ యాక్షన్ కేటగిరీలో 'అనూజ'**

ఆస్కార్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ కేటగిరీలో మనదేశం నుంచి 'అనూజ' షార్ట్‌లిస్ట్ అయింది. గునీత్‌మోంగా కపూర్ ఈ చిత్రానికి నిర్మాత. న్యూఢిల్లీలోని బట్టల మిల్లులో తన సోదరితో కలిసి పనిచేసే తొమ్మిదేళ్ల అనూజ అనే బాలిక కథ ఇది. బోర్డింగ్ స్కూల్‌లో విద్యనభ్యసించాలనే అనూజ సంకల్పానికి ఎలాంటి అవరోధాలు ఎదురయ్యాయన్నదే ఈ సినిమా కథలో ప్రధానాంశం. నిర్మాత గునీత్‌మోంగా కపూర్‌కు ఆస్కార్ పురస్కారాల్లో మంచి రికార్డు ఉంది. గతంలో ఆమె నిర్మించిన 'పీరియడ్: ఎండ్ ఆఫ్ సెంటెన్స్' బెస్ట్ డాక్యుమెంటరీగా అవార్డుని గెలుచుకుంది. 2023 ఆస్కార్ పురస్కారాల్లో 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' సైతం బెస్ట్ డాక్యుమెంటరీగా అవార్డుని కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో 'అనూజ' షార్ట్ ఫిల్మ్ ఆస్కార్ బరిలో ఆసక్తికరంగా మారింది.

# కాశీ విశ్వనాథుడి సన్నిధిలో..



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న 'తండేల్' చిత్రం నిర్మాణం నుంచే అందరిలో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. శ్రీకాకుళం మత్స్యకారుల జీవితంలో జరిగిన యథార్థ ఘటనల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. జాలరుల జీవన పోరాటం, దేశభక్తి ప్రధానాంశాలుగా దర్శకుడు చందు మొండేటి ఈ సినిమాకు రూపకల్పన చేస్తున్నారు. ఫిబ్రవరి 7న పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమాలోని 'బుజ్జి తల్లి..' అనే గీతం మ్యూజిక్ ఛార్ట్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నది. రెండో గీతం 'శివశక్తి..'ని ఈ నెల 22న వారణాసి ఘాట్స్‌లో విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా బుధవారం కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. శ్రీకాకుళం సాంస్కృతిక వారసత్వాన్ని, శ్రీముఖలింగం శివాలయ విశిష్టతను తెలియజెప్పే ఈ పాట విజువల్‌గా అద్భుతంగా ఉంటుందని, జాతర నేపథ్యంలో ఆధ్యాత్మిక శోభతో ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. దేవిశ్రీప్రసాద్ స్వరపరచిన ఈ గీతానికి శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాత: బన్నీ వాసు, రచన-దర్శకత్వం: చందూ మొండేటి.

# ఈ క్రిస్మస్ మనదే!



'ఈ సంవత్సరం 'బచ్చలమల్లి' సినిమా సక్సెస్‌తో ఎండ్ అవుతుందనుకుంటున్నా. సినిమా అద్భుతంగా వచ్చింది. దర్శకుడు సుబ్బు తాను చెప్పింది తెరపై తీసుకొచ్చాడు. ఈ సినిమాను ఏ స్థాయిలో ఆదరిస్తారో అనే విషయం ప్రేక్షకుల చేతిలో ఉంది. ఒక్కటి మాత్రం పక్కా..ఈ క్రిస్మస్ మనదే' అన్నారు అల్లరి నరేష్. ఆయన కథానాయకుడిగా సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన 'బచ్చలమల్లి' చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొస్తున్నది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. దీనికి కిరణ్ అబ్బవరం, సంయుక్త మీనన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్లరి నరేష్ మాట్లాడుతూ..హాస్య మూవీస్‌ను తన హోమ్ బ్యానర్‌లా ఫీలవుతానని, నిర్మాత రాజేష్ దండా అన్‌కాంప్రమైజ్డ్‌గా సినిమా తీశారని చెప్పారు. 'బచ్చల మల్లి' క్యారెక్టర్‌ను నరేష్ మాత్రమే చేయగలరని, అంతలా ఆ పాత్రలో ఇన్‌వాల్వ్ అయ్యారని, ప్రేక్షకులు ఓ గొప్ప సినిమా చూసిన అనుభూతికి లోనవుతారని దర్శకుడు సుబ్బు మంగాదేవి పేర్కొన్నారు. ఈ సినిమాలో తాను పోషించిన కావేరి పాత్రను అందరూ ఇష్టపడతారని కథానాయిక అమృత అయ్యర్ చెప్పింది. నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ 'దర్శకుడు సుబ్బు చెప్పిన ఈ కథకు ఎమోషనల్‌గా బాగా కనెక్ట్ అయ్యాను. సింగిల్ సిట్టింగ్‌లో నరేష్ కథను ఓకే చేశారు. ఆయన సినిమాలన్నీ ఒకెత్తు అయితే 'బచ్చలమల్లి మరో ఎత్తు. ఈ సినిమాతో నరేష్ పేరు మోత మోగిపోద్ది' అన్నారు.

# సామాన్యుడి ధిక్కార స్వరం




తమిళంలో సంచలన విజయం సాధించిన 'విడుదల' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందించిన 'విడుదల-2' ఈ నెల 20న ప్రేక్షకులముందుకొస్తోంది. విజయ్ సేతుపతి కథానాయకుడిగా వెట్రిమారన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శ్రీవేదాక్షర మూవీస్ పతాకంపై నిర్మాత చింతపల్లి రామారావు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'సామాన్యుల నుంచి ఉద్భవించిన ఓ అసామాన్యుడి వీర విప్లవ కథాంశమిది. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన యథార్థ ఘటనల ఆధారంగా తెరకెక్కించారు. ఓరకంగా తమిళ దర్శకుడు తీసిన తెలుగు కథ అనుకోవచ్చు. మన నేటివిటీకి బాగా సరిపోయింది' అన్నారు. ఈ సినిమాలో పెరుమాళ్ పాత్రలో విజయ్ సేతుపతి విశ్వరూపం చూస్తారని, నక్సలైట్ పాత్రలో ఆయన పండించిన ఎమోషన్స్ హైలైట్‌గా నిలుస్తాయని, ఇళయరాజా సంగీతం ఈ కథకు ప్రాణం పోసిందని చింతపల్లి రామారావు పేర్కొన్నారు. తమ సంస్థ ద్వారా విడుదల చేసిన 'మహారాజ' అద్భుత విజయం సాధించిందని, ఆ కోవలోనే ఈ సినిమా సైతం బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలుస్తుందన్న నమ్మకం ఉందని, తొలిభాగానికి పదిరెట్లు భావోద్వేగాలతో ఈ సినిమా మెప్పిస్తుందని ఆయన తెలిపారు. తమ బ్యానర్‌పై 'శ్రీశ్రీ రాజావారు' విడుదలకు సిద్ధంగా ఉందని, త్వరలో ఓ డ్రీమ్ ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టబోతున్నామని ఆయన చెప్పారు.

# జాక్ కామెడీ హంగామా



ఈ ఏడాది 'టిల్లు స్క్వేర్' చిత్రంతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ప్రస్తుతం ఆయన 'జాక్-కొంచెం క్రాక్' సినిమాలో నటిస్తున్నారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వ వహిస్తున్న ఈ చిత్రాన్ని బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. వైష్ణవి చైతన్య కథానాయిక. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇప్పటికే ఎనభైశాతం చిత్రీకరణ పూర్తయిందని, ఆద్యంతం హాస్యప్రధానంగా రూపొందిస్తున్న ఈ సినిమాలో సిద్ధు జొన్నలగడ్డ పాత్ర వైవిధ్యంగా ఉంటుందని, ఆయన శైలి కామెడీ, మేనరిజమ్స్‌తో అందరిని ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ప్రకాష్‌రాజ్, నరేష్, బ్రహ్మాజీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి అచ్చు రాజమణి సంగీతాన్నందిస్తున్నారు.

# యాక్షన్ థ్రిల్లర్ 'మ్యాక్స్'



కన్నడ అగ్ర నటుడు సుదీప్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'మ్యాక్స్'. వరలక్ష్మీ శరత్‌కుమార్, సునీల్ కీలక పాత్రల్లో నటించారు. విజయ్ కార్తికేయ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కలైపులి థాను నిర్మించారు. ఈ నెల 27న ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా తెలుగులో విడుదలకానుంది. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కించిన ఈ సినిమాలో అర్జున్ మహాక్షయ్ అనే పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా కిచ్చా సుదీప్ నటించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, సుదీప్ చేసిన యాక్షన్ ఘట్టాలు హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శేఖర్‌చంద్ర, సంగీతం: అజనీష్ లోకనాథ్, దర్శకత్వం: విజయ్ కార్తికేయ.

# నా చిన్నిలోకం నువ్వేనని..



ధర్మ, ఐశ్వర్యశర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకుడు. ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సినిమా నుంచి 'అర్థం చేసుకోవు ఎందుకే..' అనే లిరికల్ సాంగ్‌ను బుధవారం విడుదల చేశారు. శ్రీవసంత్ కంపోజ్ చేసిన ఈ పాటను చంద్రబోస్ రాయగా..హేషమ్ అబ్దుల్ వాహబ్ ఆలపించారు. 'అర్థం చేసుకోవు ఎందుకే..ఎన్నెన్నో చెబుతున్నా, ఏవేవో చేస్తున్నా..అర్థం చేసుకోవు ఎందుకే, నా చిన్నిలోకం నువ్వేనని, నాకున్న ప్రాణం నీదేనని..' అంటూ విఫల ప్రేమలోని బాధను వ్యక్తపరుస్తూ ఈ పాట సాగింది. పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రశాంత్ అంకిరెడ్డి, సంగీతం: శ్రీవసంత్, నిర్మాతలు: బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, లహరిధర్, రచన-దర్శకత్వం: కిరణ్ తిరుమలశెట్టి.

# వీబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బుల్లితెర అవార్డులు

విష్ణు బొప్పన సారథ్యంలోని వీబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పదో వార్షికోత్సవం సందర్భంగా 2023-24 సంవత్సరానికిగాను బుల్లితెర అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు ఎస్.వి.కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి, అంబికా కృష్ణ, జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ ఈవెంట్‌లో సీనియర్ నటి లక్ష్మీకి జీవన సాఫల్య పురస్కారం అందించారు. పలువురు టీవీ ఆర్టిస్ట్స్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌కు కూడా అవార్డులను అందించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ 'ఈ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా మా గురువుగారు దివంగత జంధ్యాల గారికి ధన్యవాదాలు చెప్పుకోవాలి. ఇన్నేళ్లుగా నన్ను ఆదరిస్తున్న ప్రేక్షకులందరికి కృతజ్ఞతలు' అని అన్నారు.



# స్క్రీన్‌ప్లే ఎవరూ ఊహించలేరు



'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' చిత్రం ద్వారా సీనియర్ రైటర్ మోహన్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. వెన్నెల కిషోర్ టైటిల్ రోల్‌లో నటించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన సమావేశంలో దర్శకుడు రైటర్ మోహన్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఏడు పాత్రల చుట్టూ ఈ కథ నడుస్తుంది. అందులో రైల్‌కి ఇంజన్‌లా వెన్నెల కిషోర్ పాత్ర ప్రధానంగా కనిపిస్తుంది. ఆయన పోషించిన డిటెక్టివ్ పాత్ర హాస్య ప్రధానంగా ఆకట్టుకుంటుంది. తెలంగాణకు చెందిన వెన్నెల కిషోర్ ఉత్తరాంధ్ర యాసను నేర్చుకొని ఈ సినిమా చేశారు. ఈ కథలో క్రైమ్, కామెడీ, ఎమోషనల్ ఎలిమెంట్స్ అన్నీ ఉంటాయి' అని చెప్పారు. 1991లో జరిగే కథ ఇదని, రాజీవ్‌గాంధీ హత్యోదంతంతో షెర్లాక్ హోమ్స్ అనే ఫిక్షనల్ క్యారెక్టర్‌కు ఉన్న సంబంధం ఏంటన్నది ఆసక్తికరంగా ఉంటుందని, స్క్రీన్‌ప్లేను ఎవరూ ఊహించలేరని రైటన్ మోహన్ తెలిపారు. తెలుగులో డిటెక్టివ్ సినిమా అనగానే 'చంటబ్బాయ్' సినిమా గుర్తుకొస్తుందని, హాలీవుడ్ ఫిక్షనల్ క్యారెక్టర్ అయిన షెర్లాక్ హోమ్స్ అందరికి పరిచయం లేనందున 'చంటబ్బాయ్ తాలూక' అనే క్యాప్షన్‌తో టైటిల్ పెట్టామని ఆయన తెలిపారు. తాను ఈవీవీ సత్యనారాయణ, పోసాని కృష్ణమురళి దగ్గర రచయితగా శిష్యరికం చేశానని, ఆ తర్వాత రాజశేఖర్ సినిమాలకు పనిచేశానని, ఆయనే తనకు రైటర్ మోహన్ అనే పేరు పెట్టాడని పేర్కొన్నారు. రచయితగా కామెడీ తనకు పెద్దబలం అని, తదుపరి సినిమా కోసం స్క్రిప్ట్ సిద్ధంగా ఉందని రైటర్ మోహన్ తెలిపారు.